# "తెలుగు కథ శతవార్షికోత్సవాలు" - ౨౦వ శతాబ్దంలో అమెరికా తెలుగు కథానిక"

*- వంగూరి చిట్టెన్ రాజు*

కథ అనగానే మనకి భారతం, రామాయణం, కాశీమజిలీ కథలు, భేతాళ కథలు, బామ్మ, లేదా తాతయ్య మన చిన్నప్పుడు చెప్పిన పొడుపు కథలు, హరి కథ, బుర్ర కథ, ఆఖరికి సినిమా కథలు, ఇలా ఎన్నెన్నో గుర్తుకు రావచ్చు. కానీ తెలుగు కథ అనగానే మన సాహిత్యంలో గత వంద సంవత్సరాలకి పైగా నిలదొక్కుకుని ప్రపంచస్థాయికి ఎదిగే అవకాశాలు ఉన్న సాహిత్య ప్రక్రియ మన "ఆధునిక కథ" అని మనందరికీ అనుకోకుండానే అనిపిస్తుంది. ఈ రోజుల్లో నవలా సాహిత్యం మరుగున పడిపోయింది. కవితా సంకలనాలు చెప్పుకో దగ్గ సంఖ్యలో వెలువడుతున్నప్పటికీ, పౌరాణికేతర, సృజనాత్మక సాహిత్యం పుస్తకాల కొనుగోలు విషయంలో కథా సంకలనాలదే అగ్ర తాంబూలం. కథా రచయితలు అనేక మంది, అనేక విషయాలను స్పృశిస్తూ, అన్ని మాండలికాలలోనూ మంచి కథలు వ్రాస్తున్నారు. అందుకే ఆధునిక కథకి ప్రస్తుతం "స్వర్ణయుగం" నడుస్తోంది అని సాహితీవేత్తల అభిప్రాయం.

గమనించదగ్గ విషయం ఏమిటంటే, మొత్తం భారత దేశంలోనే ఆధునిక కథ ౧౮౯౭లో బెంగాలీలో గంగోపాధ్యాయ వ్రాసిన "మధుమతి" అనే కథ. తెలుగులో ఈ ఆధునిక ఎప్పుడు "పుట్టింది" అనే విషయంలో కనీసం ఏడు అభిప్రాయాలు మన సాహితీ ప్రపంచంలో ఉన్నాయి. ఈ విషయాన్ని పరిశోధించి, - ఆధారాలు చూపించి, తర్కించిన వారిలో కొండవీటి సత్యవతి (భూమిక), భార్గవీ రావు (నూరేళ్ళ పంట - కథా సంకలనం), పురిపండ అప్పల స్వామి, గిడుగు సీతాపతి, ఆరుద్ర, నిడదవోలు వెంకట్రావు, అక్కిరాజు రమాపతిరావు, వల్లంపాటి వెంకటసుబ్బయ్య, శెట్టి ఈశ్వరరావు, సుజాత, ఆదిరాజు వీరభద్రరావు మొదలైన వారు ప్రముఖులు. ఈ వాదనలన్నింటినీ క్లుప్తంగా క్రోడీకరించి, ఎంతో శ్రమ పడి తెలుగులో ప్రచురించబడిన మొదటి ఏడు కథలనూ శ్రీ కాళీపట్నం రామారావు గారు (కథానిలయం-శ్రీకాకుళం) ఫిబ్రవరి, ౨౦౦౬లో ప్రచురించి మన సాహిత్య చరిత్రకి ఎనలేని సేవ చేశారు.

తొలి తెలుగు కథలు - ప్రచురణాక్రమం. (కథా నిలయం వారి ప్రచురణ ఆధారంగా)

౧. "ధన త్రయోదశి" - భండారు అచ్చమాంబ- హిందూ సుందరి, ౧౯౦౨ నవంబరు సంపుటము ౧: సంచిక 7 (గ్రాంథిక భాష)

౨. "స్త్రీ విద్య "(భార్యాభర్తల సంవాదము) - హిందూ సుందరి, ౧౯౦౨ నవంబరు సంపుటము ౧: సంచిక 7 (గ్రాంథిక భాష)

౩. "లలిత - ఆచంట సాంఖ్యాయన శర్మ, "కల్పలత" - ౧౯౦౩ నవంబరు సంపుటం: ౧, సంచిక: ౩. (గ్రాంథిక భాష)

4. "విశాఖ" - ఆచంట సాంఖ్యాయన శర్మ, "కల్పలత" - ౧౯౦4 అక్టోబర్- నవంబరు సంచికలు. (గ్రాంథిక భాష)

5. "అపూర్వోపన్యాసము" - ఆచంట సాంఖ్యాయన శర్మ, "కల్పలత" - ౧౯౦౩ నవంబరు సంచిక: 4. (గ్రాంథిక భాష)

౬. "దిద్దుబాటు" - గురజాడ అప్పారావు - "ఆంధ్రభారతి" ఫిబ్రవరి ౧౦,౧౯౧౦. వ్యావహారిక భాష

7. "హృదయ శల్యము" - మాడపాటి హనుమంత రావు. - "ఆంధ్రభారతి" ౧౯౧౨ (గ్రాంథిక భాష)

ఈ పట్టికని బట్టి, ఇతర ప్రముఖుల అభిప్రాయాలని ఆమోదిస్తూ, ఈ సంవత్సరం (౨౦౦౯) తెలుగు నాట, వ్యావహారిక భాషలో గురజాడ వారి కథని తొలి - ఆధునికకథగా గుర్తించి "తెలుగుకథ శతవార్షికోత్సవాలు" జరుపుకుంటున్నారు. చెప్పుకోదగ్గ విశేషం ఏమిటంటే గురజాడ గారు మొదట ఇదే కథని "కమలిని" అనే పేరుతో గ్రాంథిక భాషలో వ్రాసినప్పటికీ, ఆప్త మిత్రుడు, సాహిత్యం అందరికీ అర్థమయ్యే వ్యావహారిక భాషలో ఉండాలని వాదించిన సాహితోద్యమకారులైన గిడుగు రామమూర్తి గారి పట్టుదల వలన అదే కథను వ్యావహారిక భాషలో తిరగ వ్రాసి, ప్రచురించారు. మరొక ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, "దిద్దుబాటు" ప్రచురించబడిన సంచికలోనే, వ్యావహారిక భాషలోనే గురజాడ వారి రెండో కథ "మీ పేరేమిటి?" కూడా ప్రచురించబడింది. కానీ "కథానిలయం" వారు ఈ కథని తొలి కథలలో ఒకటిగా గుర్తించ లేదు. అయినా, శ్రీ కేతు విశ్వనాథ రెడ్డి గారు ప్రధాన సంపాదకులుగా విశాలాంధ్ర వారు ౨౦౦౬లో

ప్రచురించిన "తెలుగు కథ"లో ఈ కథని గుర్తించి ప్రచురించారు. సుప్రసిద్ధ కథకులు కొడవటిగంటి కుటుంబరావు, గోపీచంద్‌లే కాక, మహాకవి శ్రీశ్రీ గారి శతజయంతి కూడా ఈ సంవత్సరమే కావడం గమనించదగ్గది.

ఇంచుమించు ౨౦వ శతాబ్దం తొలి దశకం నుంచి ౧౯౨౫ వరకూ తెలుగు కథ తప్పటడుగులు వేస్తూ వచ్చింది. ఎందుకంటే ఈ నాటి కథా లక్షణాలు, వాటి అవగాహన (శిల్పం, శైలి, వస్తువు, గమనం, రంభం, ముగింపు, క్లుప్తత మొదలైనవి.) పూర్తిగా పరిణితి చెందక ఆ రచనలని నవలిక, చిన్న కథ, కథకము, కథనకము, మొదలైన పేర్లుపెట్టేవారు. ౧౯౩౬లో ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి గారు ఈ లక్షణాలని క్రోడీకరించి, ఈ ప్రక్రియకు "కథానిక" అనే పేరుని నిర్ధారించారు. ఇప్పుడు పేజీలు ఎక్కువ ఉంటే కథ, రెండు, మూడు పేజీలు మాత్రమే ఉంటే కథానిక అని వాడుకలో ఉన్న అర్థాలు.

అమెరికాలో తెలుగుకథ: చారిత్రాత్మక ప్రాముఖ్యత:

మామూలుగా కథాప్రక్రియ గురించి కానీ, ఏ కథారచయిత ప్రత్యేకత గురించి కానీ మాట్లాడుకునేటప్పుడు కథా బలమూ, చదివించే శక్తీ మొదలైన సాహిత్య పరమైన విషయాలకే తప్ప చారిత్రాత్మక ప్రాముఖ్యత ఎక్కువగా ప్రస్తావనలోకి రాదు. కానీ, అమెరికా తెలుగు కథ అనగానే, నా దృష్టిలో తెలుగు కథ శతచార్షికోత్సవాల నేపథ్యంలోనే కాకుండా, విదేశాలకు వలస వెళ్ళి, భిన్న సంస్కృతుల మధ్య తెలుగు వారి జీవన విధానాల అవగాహనకి అమెరికా కథకుల ప్రయత్నాలు, ప్రచురించిన కథలూ ఎంతో విశిష్టమైన, అంతకు పూర్వం ఎన్నడూ కనీ వినీ ఎరగని చారిత్ర్మాకత ప్రాముఖ్యతని సంతరించుకుంటాయి.

ఎందుకంటే తరతరాలుగా ఎందరో తెలుగు వారు మన మాతృదేశాన్ని వదిలిపెట్టి ఇతర దేశాలకు తరలి వెళ్ళారు, వెడుతున్నారు, ఇక ముందు కూడా వెళ్తారు. బర్మా, మలేషియా, ఫిజీ, ఇండోనేషియా, దక్షిణ ఆఫ్రికా, మారిషస్, సింగపూర్, ఇంగ్లండ్.. ఒకటేమిటి.... ప్రపంచ వ్యాప్తంగా అన్ని ప్రాంతాలకీ విస్తరించిన మన తెలుగు వారి అనుభవాలు, మొదటి తరం వారి కష్టనష్టాలూ, తరవాతి తరం వారి సమస్యలూ, సుఖాలూ, దు:ఖాలూ నా బోటి సామాన్యులకి అందుబాటులో లేవు. నా వ్యక్తిగతమైన అభిప్రాయంలో అందుకు ముఖ్య కారణం ఆయా దేశాలలో స్థిరపడిన తెలుగు వారు తమ అనుభవాలను, చరిత్రనూ సాహిత్యరూపంలో పదిల పరచక పోవడమే. ఎందుకంటే సాహిత్యం కలకాలం నిలబడుతుంది. పైగా "రవి గాంచనిచో కవి గాంచును" కాబట్టి తమదే అయిన పద్ధతిలో రచయితలు వాస్తవికతకి తమ ఊహాజనితమైన ఆలోచనలు కూడా జోడించి జరుగుతున్న చరిత్రని రసవత్తరంగా మన కళ్ళ ముందు ఉంచగలరు.

ఉదాహరణకి, చారిత్రాత్మకంగానూ, శాస్త్రీయపరంగానూ ఖచ్చితంగా తెలియకపోయినా మొత్తం, భారత దేశ చరిత్ర ఈ నాడు ఏ మాత్రమైనా తెలుస్తున్నదీ అంటే అందు కారణం కేవలం సాహిత్యమే అని నా వ్యక్తిగత అభిప్రాయం. ఉదాహరణకి, భారత, భాగవత, రామాయణాలే అద్భుతమైన సృజనాత్మకతతో వ్యాసుడు, వాల్మీకి వ్రాయకపోతే, ఆ కథలు ఇప్పటికీ నిలబడేవే కావు. రాముడు, కృష్ణుడు మొదలైన వారు దేముళ్ళని మనకీనాడు తెలిసేదే కాదు. భారత దేశ చరిత్ర రచించిన ప్రతీ చరిత్రకారుడూ, దొరికిన శిథిలాలు, శాసనాలతో పాటు, వేదాలనీ, పురాణాలనీ, ఇతిహాసాలనీ మథించి, అందులోంచి చారిత్రాత్మక సత్యాలని వెలికి తీసి అనుసంధానం చేశారు.

ఉత్తర అమెరికాకి తెలుగు వారు రావడం ౧౯౬౦ లలో మొదలు పెట్టినా, పెద్ద ఎత్తున వలస వచ్చి ఇక్కడే స్థిరపడిపోవడం ౧౯౭౦లలో ప్రారంభం అయిందని చెప్పవచ్చు. మొదటితరం అమెరికా ఆంధ్రులు తెలుగు భాషమీదా, సంస్కృతి మీదా మమకారం ఏ మాత్రం తగ్గించుకోలేదు. అందువలనే అమెరికాలో అన్ని నగరాల లోనూ తెలుగు రచయితలు తమ అనుభవాలనీ, మాతృదేశం జ్ఞాపకాలనీ, భిన్న సంస్కృతుల మధ్య తమ జీవన విధానాలనీ ప్రతిబింబిస్తూ ఎవరికి తోచిన శైలిలో వారు రచనలు సాగిస్తూ వచ్చారు. వారిలో చాలా మంది అమెరికా వచ్చాకే రచనావ్యాసంగం చేపట్టారు. వారంతా తెలుగు డైస్పోరా రచయితలు. ముఖ్యంగా మొదటి తరం రచయితల రచనలకి విశేషమైన చారిత్రాత్మక ప్రాముఖ్యత ఉంటుంది. మొదటితరం అనుభవాలు మరింకెవరికీ అందుబాటులో ఉండవు. ఇవన్నీ బహుశా పదేళ్ళనుంచీ, పాతికేళ్ళలోపుగా అంతరించి పోయి, రెండో తరం పుట్టుకొస్తుంది. రెండో తరం వారి కథలూ, కమామీషులూ వేరు. ఏ తరం వారైనా, సాహిత్య రూపంగా ఆయా రచనలని ప్రచురించి, పదిల పరిచినప్పుడే వాటికి శాశ్వత రూపం కలుగుతుంది.

"౨౦వ శతాబ్దంలో అమెరికా తెలుగు కథానిక మరియు అమెరికా తెలుగు సాహితీవేత్తల పరిచయ గ్రంథం" ప్రచురణ.

తమ సృజనాత్మకరచనల ద్వారా, అంటే తాము రచించిన కథలూ, కవితలద్వారా చరిత్రని సృష్టిస్తున్నట్టు గానీ, చరిత్రని పదిలపరుస్తున్నట్టుగానీ తెలుగు రచయితలకి ముఖ్యంగా ఉత్తర అమెరికా తెలుగు రచయితలకి తెలియజేయడం, వారి రచనలని పదిల పరచడం నా దృష్టిలో చాలా ముఖ్యమైన విషయం. అటువంటి శాశ్వత రూపం నాకున్న పరిధులలో ఎలా కలిగించాలా అనేది నన్ను చాలా వేధించిన సమస్య. ఈ సమస్యకి నాకు తోచిన పద్ధతిలో పరిష్కరించే అవకాశం ఇప్పుడు వచ్చింది. ఈ అవకాశం పేరు "తెలుగు కథ శతవార్షికోత్సవాలు". దేశమంతటా వంద సంవత్సరాల తెలుగుకథని నెమరు వేసుకునే ఈ చారిత్రాత్మక వాతావరణంలో అమెరికా ఖండంలో ఇంచుమించు ఆరుదశాబ్దాల సంవత్సరాల తెలుగు కథ, తెలుగు సాహిత్యాల పెంపుదలకి కారకులైన నిస్వార్ధ సేవకులని గుర్తించి, గౌరవించడం సమంజసంగా భావించాం. ఆ భావనకి మేము కల్పించిన రూపు "౨౦వ శతాబ్దంలో అమెరికా తెలుగు కథానిక మరియు అమెరికా తెలుగు సాహితీవేత్తల పరిచయ గ్రంథం" ప్రచురణ. వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు ప్రచురించిన 'ఈ బృహత్ గ్రంధాన్ని (సుమారు ఆరు వందల పెద్ద పేజీలు, ౧౧౬ అమెరికా కథలు, ౧౨౫ అమెరికా సాహితీవేత్తల జీవిత విశేషాలు) శ్రీ కాళీపట్నం రామారావు గారే మార్చి ౧౧, ౨౦౦౯ నాడు హైదరాబాదులో ఆవిష్కరించి తెలుగుకథ శతవార్షి కోత్సవాల నేపధ్యంలో ఈ పుస్తక ప్రాముఖ్యతను విశదీకరించడం మా అదృష్టంగా భావిస్తున్నాం.

ఆధునిక తెలుగు కథ వయసు వంద సంవత్సరాలు అయితే, అందులో ఇంచుమించు యాభై సంవత్సరాల నుంచి అమెరికా తెలుగు కథకులు భిన్న సంస్కృతుల మధ్య తెలుగు వారి జీవితానుభవాలని ...అంటే డైస్పోరా జీవితాలని కథా వస్తువుగా రచించిన కథలకి ఎంతో ప్రాముఖ్యం ఉంది అనడంలో ఏమీ సందేహం లేదు. విచారకరమైన విషయం ఏమిటంటే తెలుగు నాట సాహితీవేత్తలూ, విమర్శకులూ చాల మంది మన అమెరికా కథని తగిన స్థాయిలో గుర్తించదానికి నిరాకరిస్తున్నారు. గురించిన కొద్ది మంది కూడా "ఏదో, పరాయి దేశంలో ఉన్నారు కదా! వాళ్ళ అవస్థలగురించి బానే రాస్తున్నారు" అనే "పై నుంచి కిందకి దిగి వస్తున్నాట్టుగానే అభిప్రాయాలు వెలిబుచ్చడం కూడా విచారకరమే. అమెరికా తెలుగు కథలు రాసిలో తక్కువే అయినా వాసిలో తెలుగు నాట వెలువడుతున్న కథలకి ఏ మాత్రం తీసిపోవు అని నేను ఖచ్చితంగా చెప్పగలను.

కొన్ని వేల సంవత్సరాల తెలుగు సాహిత్య చరిత్రలో విదేశాంధ్రుల సాహిత్యాన్ని, విశిష్టతనూ, చారిత్రాత్మక ప్రాముఖ్యతనూ గుర్తించి, ప్రచురించి, వెలుగులోకి తెచ్చిన ఏకైక ప్రయత్నం ఈ పుస్తక ప్రచురణ. ఈ బృహత్ గ్రంధం విలువ చరిత్రకారులే నిర్ణయిస్తారు.

అమెరికాలో తెలుగు కథ వికాసం, పెంపుదల విషయాలపై మా పరిశోధన ఆధారంగా మేము గమనించిన కొన్ని ఆసక్తికరమైన విషయాలు ఈ క్రింద పొందుపరిచాం.

౧. భారతదేశంలో ప్రచురించబడిన మొట్టమొదటి ఉత్తర అమెరికా తెలుగు కథా రచయిత స్వర్గీయ పులిగండ్ల మల్లికార్జున రావు, (ఎడ్మంటన్, కెనడా). కథ పేరు "వాహిని"- ఆంధ్ర సచిత్ర వారపత్రిక , ఏప్రిల్ ౨౪, ౧౯౬౪ సంచికలో ముద్రించబడింది. రచయిత కలం పేరు "ఆర్ఫియస్". మరో కలం పేరు "విజయ". ఈ విషయాన్ని వెలుగులోకి తెచ్చినది "రచన" సాయి గారు.

౨. ఉత్తర అమెరికాలో ప్రచురించబడిన మొట్ట మొదటి తెలుగు కథలు:

"పుట్టిల్లు"-శ్రీమతి చెరుకూరి రమాదేవి(డిట్రాయిట్)

"పిరికి వాడు" - కోమలా దేవి

"యవ్వన కుసుమాలు వాడిపోతే" - కస్తూరి రామకృష్ణా రావు

ప్రచురణ: అమెరికాలో మొట్టమొదటి తెలుగు పత్రిక "తెలుగు భాషా పత్రిక" అట్లాంటా ప్రారంభ సంచిక , ఏప్రిల్ ౧౯౭౦. (సంపాదకులు: పెమ్మరాజు వేణుగోపాల రావు)

౩. క్రమం తప్పకుండా రెండు దశాబ్దాలకు పైగా తెలుగు కథలను విస్తృతంగా ప్రచురించి, ప్రోత్సహించిన పత్రిక "తెలుగు జ్యోతి". (తెలుగుకళాసమితి, న్యూజెర్సీ)

4. అమెరికాలో అత్యధిక సంఖ్యలో కథలు వ్రాసి, ప్రచురించిన కథకులు శ్రీ సత్యం మందపాటి (ఆస్టిన్) .

5. అమెరికాలో ప్రచురించబడిన మొట్టమొదటి కథా సంకలనం: "అమెరికా తెలుగు కథానిక - మొదటి సంకలనం" ౧౯౯౫,(వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా)

ముక్తాయింపు:

అమెరికా తెలుగు కథకీ, రచయితలకీ తెలుగు సాహిత్య చరిత్రలో సముచితమైన స్థానాన్ని కలిగించి, గుర్తింపు తేవడం నా వ్యక్తిగత జీవిత ధ్యేయాలలో ఒకటి. వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా ద్వారా, అనేక మంది సహకారంతో, ఆరు సంవత్సరాల కృషి ఫలితంగా "కేవలం ఎనిమిది వేల డాలర్ల వ్యయం" తో తెలుగు కథ శతవార్షికోత్సవాల సందర్భంగా ఫిబ్రవరి, ౨౦౦౨లో ఈ "౨౦వ శతాబ్దంలో అమెరికా తెలుగు కథానిక మరియు అమెరికా తెలుగు సాహితీవేత్తల పరిచయ గ్రంథం" పుస్తక ప్రచురణ జరగడంతో తెలుగు సాహిత్యం, చరిత్ర ఒక మెట్టు ఎదిగాయి. ఈ బృహత్ గ్రంథం పుస్తకాల షాపులలో దొరకదు. ఇటీవల వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు సంస్థాపించిన "తెలుగు పుస్తక సమాఖ్య" సభ్యులకి అందించబడుతుంది. కావలసిన వారు అటు ఇండియాలోనూ, ఇటు అమెరికా లోనూ వంగూరి ఫౌండేషన్ వారిని సంప్రదించండి.

(vangurifoundation@yahoo.com,
Phone ౮౩౨ ౫౯౪ ౯౦౫౪

## నిష్క్రమణ

*- విన్నకోట రవిశంకర్*

అంతా ఆగిపోతుంది.

పంచభూతాలు సంగమించి
శ్రమించి సృష్టించిన ఒక కల
నాకనురెప్పలు మూతపడగానే
కరిగిపోతుంది

తాను నిరంతరం
అదే పనిగా వీక్షించే
నాటకం నుంచి
నేను నిష్క్రమించగానే
ఆకాశపు తెర అలవోకగా తెరుచుకుంటుంది

పసిపాప కళ్ళలోకి
నిద్ర చేరినంత నిశ్శబ్దంగా
ఫలదీకృత కణంలోనికి
జీవం ప్రవేశించినంత రహస్యంగా
శరీరప్రాంగణానికావలి ప్రపంచంలోకి
అడుగుపెడతాను

పగలు రాత్రిగానో
రాత్రి పగలుగానో
మారుతూంటుంది
అప్పుడే విచ్చుకోబోతున్న పూలరెక్కలు
ఒంటికి సెంటు పూసుకోవటం ఆపి
ఒకసారి తల పంకిస్తాయి




ఎక్కడికో ఎగిరిపోతున్న పక్షులు ఆగి
తమ రంగురంగుల రెక్కల్ని
చప్పట్లుకొడుతున్నట్టుగా టపటపలాడిస్తాయి

ఒక లిప్తకాలం పాటు ఏదో ఆసక్తి
అటు పిమ్మట, తిరిగి అంతా
ఎప్పట్లాగే సాగిపోతుంది.